



# ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్

17-5-2026

వెల: రూ.5/-

పేజీలు: 8

సంపుటి: 09

సంచిక: 248

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## చర్లపల్లి జైలుకు భగీరథ్

### పోక్సో కేసులో అరెస్టు చేసిన పోలీసులు..

### లొంగిపోయాడన్న తండ్రి బండి సంజయ్

**రాత్రి 9 గంటలకు పోలీసు స్టేషన్ కు రాక.. రెండు గంటలపాటు విచారించిన పోలీసులు**

**అనంతరం మెజిస్ట్రేట్ ఎదుటకు భగీరథ్..14 రోజుల రిమాండ్ విధించిన జడ్జి**

హైదరాబాద్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నార్సింగి అప్పా జంక్షన్‌లోని పోలీసు అకాడమీ వద్ద సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ పి.శోభన్ కుమార్, అతని బృందం నిందితుడు భగీరథ్‌ను శనివారం రాత్రి 8:15 గంటలకు అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ నిరాకరించిన మర్నాడే ఈ కీలక పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. అరెస్టు తర్వాత భగీరథ్‌ను భారీ బందోబస్తు నడుమ రాత్రి 9:05 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత ఠాణాలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సుమారు రెండున్నర గంటల పాటు భగీరథ్‌ను సుదీర్ఘంగా విచారించారు. రాత్రి 11:35 గంటలకు భగీరథ్‌ను మేడ్చల్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు.

## పిల్లలే సంపద’

**మూడో బిడ్డను కంటే రూ.30 వేలు, నాలుగో బిడ్డకు రూ.40 వేలు... చంద్రబాబు బంపర్ ఆఫర్**

**పిల్లలే సంపద’ పేరుతో జనాభా పెరుగుదలకు ఏపీ సర్కార్ కొత్త పథకం**

**జనాభా తగ్గితే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న సీఎం చంద్రబాబు**

**పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీని ప్రకటించిన ప్రభుత్వం**

**శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ముఖ్యమంత్రి ప్రకటన**



శ్రీకాకుళం: పేదరికం లేని సమాజం చూడాలనేదే తన కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుంది. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి చేస్తుంది. అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశాం. సింగిల్ యూజ్ ప÷-లాస్టిక్‌ను నిషేధించాలి. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మన పిల్లలకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాం. పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలని చంద్రబాబు అన్నారు.

2లో

## ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

**నీట్‌పై ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ డిమాండ్**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ ఉదంతం నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, లేదా ఈ వైఫల్యానికి వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని ప్రధాని మోదీని శనివారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బీజేపీ--ఆర్ఎస్ఎస్



## బంగారం ధరల్లో పతనం

పది గ్రాములపై రూ.980ల మేర తగ్గిన ధర

రూపాయి మారకం కనిష్టానికి చేరిక



### తమిళనాడు సిఎం, మంత్రులకు

## శాఖల కేటాయింపు

విజయ్ వద్దే హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్

సెంగొట్టియన్‌కు ఆర్థిక శాఖ కేటాయింపు



## 19 నుంచి పుతిన్ చైనా పర్యటన

### వ్యూహాత్మక సహకారం బలోపేతంపై చర్చలు



న్యూఢిల్లీ : తమ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మే 19, 20 తేదీలలో చైనాను అధికారికంగా సందర్శించనున్నట్లు రష్యా ప్రభుత్వం శనివారం ప్రకటించింది. రష్యా, చైనా మధ్య సమగ్ర భాగస్వామ్యాన్ని, వ్యూహాత్మక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ యోచిస్తున్నారని

2లో

## 11వ శతాబ్ది నాటి చోళుల రాగి ఫలకాలు భారత్‌కు రాక

**నెదర్లాండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ**

**రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుడి కాలం నాటివిగా గుర్తింపు**

**ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణమన్న ప్రధాని మోడీ**

**1862 నుంచి లైడెన్ యూనివర్సిటీ వద్ద ఉన్న ఫలకాలు**

భారత చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. 11వ శతాబ్దానికి చెందిన చోళుల కాలం నాటి అమూల్యమైన రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి తిరిగి స్వదేశానికి రానున్నాయి.





## ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి: మంత్రి గొట్టిపాటి

### ఇంధన పొదుపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**6 లక్షల పేద కుటుంబాలకు ఉచితంగా ‘సూర్య ఘర్’ కనెక్షన్లు**

**ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీ అందించాలని సీఎం ఆదేశం**

**పునరుత్పాదక ఇంధనంతో ఛార్జీల తగ్గింపునకు చర్యలు**

**గత ప్రభుత్వం మోపిన భారాన్ని తగ్గించడమే లక్ష్యం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, విద్యుత్ ఛార్జీలు తగ్గించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. శనివారం

## జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ



లేని పక్షంలో ముసాయిదా జాబితాలో పేరు తొలగింపు

సీఈఓ సుదర్శన్‌రెడ్డి స్పష్టీకరణ

విచారణకు హాజరై పుట్టిన ప్రాంతం ధ్రువీకరణకు 12 పత్రాల్లో ఒకదానిని ఇవ్వాలి

ఆన్‌లైన్‌లో కూడా ఎన్యూమరేషన్ ఫారం పూరించి సమర్పించవచ్చు

గుర్తింపు రుజువు కోసం ఆధార్ కార్డు స్వీకరణ

హైదరాబాద్: ఓటర్ల జాబితా విస్తృత సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్/సర్)--2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని బూత్ లెవల్ అధికారుల(బీఎల్ఓ)కు ఇవ్వని ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాలో తొలగిస్తారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి చెప్పారు. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటరుకు 2 ప్రతుల ఎన్యూమరేషన్ ఫారాన్ని అందజేస్తారని తెలిపారు.

## 11వ శతాబ్ది నాటి చోళుల రాగి ఫలకాలు భారత్‌కు రాక

(మొదటి పేజీ తరువాయి)

నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో నిన్న జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫలకాలను భారత్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ, డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ హాజరయ్యారు. ఈ రాగి ఫలకాల సెట్‌లో 21 పెద్దవి, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై సంస్కృతం, తమిళ భాషల్లో శాసనాలు ఉన్నాయి. తన తండ్రి రాజరాజ చోళుడు ఇచ్చిన వాగ్దానాన్ని కుమారుడైన రాజేంద్ర చోళుడు అధికారికంగా నెరవేర్చిన చారిత్రక ఘట్టాన్ని ఇవి వివరిస్తాయి. నాగపట్నంలోని బౌద్ధ విహారానికి అనైమంగళం గ్రామ ఆదాయాన్ని కేటాయించినట్లు ఈ ఫలకాలలో పొందుపరిచారు. చోళుల వైభవాన్ని, పరిపాలనా దక్షతను ఈ శాసనాలు తెలియజేస్తాయి.దాదాపు 1862 నుంచి ఈ ఫలకాలు నెదర్లాండ్స్‌లోని లైడెన్ యూనివర్సిటీ ఆధీనంలో ఉన్నాయి. వలస పాలన కాలంలో వీటిని అక్రమంగా తరలించారని నిర్ధారించిన డచ్ కమిటీ సిఫారసుల మేరకు, భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనతో వీటిని తిరిగి అప్పగించడానికి నెదర్లాండ్స్ ప్రభుత్వం అంగీకరించింది.ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. “ఇది ప్రతి భారతీయుడికి ఆనంద క్షణం” అని పేర్కొన్నారు. చోళుల గొప్పతనాన్ని, వారి సంస్కృతిని, సముద్ర వాణిజ్య నైపుణ్యాన్ని భారత్ ఎంతో గర్వంగా స్మరించుకుంటుందని తెలిపారు. ఈ ఫలకాలను ఇన్నాళ్లు భద్రపరిచిన లైడెన్ యూనివర్సిటీకి, నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ఈ ఫలకాలను అధికారికంగా భారత్‌కు తరలించనున్నారు.

## బంగారం ధరల్లో పతనం

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: భారత్‌లో శనివారం కూడా బంగారం, వెండి ధరల్లో పతనం కనిపించింది. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, డాలర్ బలపడుతున్న నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980ల మేర తగ్గి రూ.1,56,930కు పడిపోయింది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.900ల మేర తగ్గి రూ.1,43,850కు చేరుకుంది. నగరంలో కిలో వెండి ధర రూ.15 వేల మేర తగ్గి రూ.2.9 లక్షలకు దిగింది. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.950 మేర తగ్గింది. వెండి ధరలో రూ.10 వేల మేర కోత పడింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910కు చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,47,500 వద్ద ట్రేడవుతోంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,080గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,000గా ఉంది. ముంబైలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930కు చేరుకోగా 22 క్యారెట్ల వెండి ధర 1,43,850కు చేరింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ.3 లక్షల మార్కు దిగువకు చేరుకుంది. చెన్నైలో గరిష్ఠంగా కిలో వెండి రూ.2.9 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇదిలావుంటే భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఒక దశలో 50 పైసలు క్షీణించి రూ.96.14కు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.96 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం, డాలర్ బలోపేతం, దేశీయంగా ధరలు మరింత ఎగబాకవచ్చన్న ఆందోళనలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. అయితే, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి మళ్లీ కాస్త కోలుకుంది. దాంతో డాలర్‌తో మారకం రేటు 17 పైసల నష్టంతో రూ.95.81 వద్ద ముగిసింది. ఇది కనిష్ఠ ముగింపు స్థాయి కూడా. గురువారం సెషన్‌లో డాలర్‌తో రూపీ మారకం రేటు 2 పైసలు లాభపడి రూ.95.64 వద్ద క్లోజైంది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 0.34 శాతం పెరిగి 99.15 స్థాయిలో ట్రేడైంది. బ్రెంట్ ముడి చమురు బ్యారల్ ధర ఒక దశ లో 3.14 శాతం పెరిగి 109.04 డాలర్లకు చేరుకుంది. 6 రోజుల్లో 2 శాతం డౌన్: గడిచిన 6 ట్రేడింగ్ సెషన్లలో డాలర్‌తో రూపాయి మారకం విలువ దాదాపు 2 శాతం క్షీణించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6 శాతానికి పైగా పతనమైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, దాంతో చమురు ధరలు 100 డాలర్ల పైకి ఎగబాకడం, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, ద్రవ్యోల్బణ భయాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం తగ్గడం వంటి అంశాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. మున్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95.60-96.20 శ్రేణిలో కదలాడవచ్చన్నారు.

## ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి: మంత్రి గొట్టిపాటి

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, శిలాజ ఇంధనాల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా సంకల్పించారని తెలిపారు. ఇందులో భాగంగానే పగటిపూట సౌరశక్తిని వినియోగించుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేదలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో 6 లక్షల ‘సూర్య ఘర్’ సోలార్ కనెక్షన్లను ఉచితంగా అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేంద్రం దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకుంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 20 లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయడమే ధ్యేయమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తోందని, దీనికి అదనంగా బీసీలకు రూ.20 వేలు, ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీగా రూ.1.25 లక్షలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి, ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గొట్టిపాటి పేర్కొన్నారు. గత రెండేళ్లుగా రూ.5,000 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించి విద్యుత్ బిల్లులు పెరగకుండా చూసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపిన భారాన్ని తాము అధికారంలోకి రాగానే తగ్గించామని, ఇప్పటికే యూనిట్‌కు 13 పైసలు తగ్గించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఛార్జీలు మరింత తగ్గించడమే సీఎం లక్ష్యమన్నారు. తన ప్రోటోకాల్ వాహనాలను తగ్గించుకోవడం ద్వారా ఇంధన పొదుపును స్వయంగా ఆచరిస్తున్నట్లు తెలిపారు.

# చర్లపల్లి జైలుకు భగీరథ్

ఆ తర్వాత నిందితుడిని మేడ్చల్‌లోని మేజిస్ట్రేట్ నివాసంలో హాజరుపరిచారు. ఆయన సమక్షంలోనే భగీరథ్ వాంగ్మూలాన్ని పోలీసులు మరోసారి నమోదు చేశారు. అలాగే బాధితురాలు మైనర్ బాలిక, ఆమె తల్లి వాంగ్మూలాన్ని కూడా పోలీసులు నమోదు చేశారు. ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు రెండుసార్లు రికార్డ్ చేసిన సంగతి తెలిసిందే. విచారణ అనంతరం మేజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల జ్యుడీయల్ రిమాండ్ విధించారు. దీంతో భగీరథ్‌ను పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. శనివారం ఉదయం పేట్ బషీరాబాద్ పోలీసులు బంజారాహిల్స్ రోడ్ నం.3లోని ఆరోరా కాలనీలోని బండి సంజయ్, భగీరథ్ మేనమామ కరీంనగర్‌లోని కార్తికేయ ఆసుపత్రిలో డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ ఇంట్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. రెండు గంటల పాటు దాడులు చేసిన అధికారులు సీసీటీవీ ఫుటేజ్‌లతో పాటు పలు కీలక సమాచారాన్ని సేకరించారు. శనివారం ఉదయం నుంచే భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోతాడనే ప్రచారం జరిగిన నేపథ్యంలో పేట్ బషీరాబాద్ ఠాణా, చర్లపల్లి జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భాజపా కార్యకర్తలు, ఇతరులు ఎవరూ లోనికి రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కుత్బుల్లాపూర్‌లోని సుచిత్ర ప్రాంతంలో నివసించే ఓ మైనర్ బాలికతో భగీరథ్‌కు గతేడాది పరిచయం ఏర్పడింది. తరచూ ఆమెను కలవడం, ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె నమ్మకాన్ని చూరగొన్నాడు. శారీరకంగా ఆమెను లొంగదీసుకునేందుకు పలుమార్లు ప్రయత్నించాడు. ఈక్రమంలో గతేడాది డిసెంబర్ 31న మొయినాబాద్‌లోని తన ఫామ్‌హౌస్‌కు బాలికను తీసుకెళ్లిన భగీరథ్.. ఆమెతో బలవంతంగా మద్యం తాగించాడు. ఆమె అపస్మారక స్థితిలో ఉండగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర మానసిక, శారీరక కుంగుబాటుకు గురైన బాలిక ఈ విషయాన్ని తల్లికి తెలిపింది. దీంతో ఆమె ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సున్నితమైన కేసు కావడంతో కేసు విచారణ నిమిత్తం ప్రభుత్వం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణాధికారిగా ‘సిట్’ను నియమించిన సంగతి తెలిసిందే. పేట్ బషీరాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) పోక్సోలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 74, 75 కింద కేసులు నమోదు చేశారు. అయితే ఈ సెక్షన్లను పరిశీలించిన పర్యవేక్షణాధికారి రితిరాజ్ మంగళవారం బాధితురాలిని మరోసారి విచారించారు. ఆమె ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భగీరథ్‌పై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసిన లైంగిక చర్యలకు సంబంధించిన సెక్షన్లను సూచించే పోక్సో--2012 చట్టంలోని సెక్షన్ 5(ఐ) జోడించారు. కేసు నమోదైన నాటి నుంచి 8 రోజులుగా నిందితుడు బండి భగీరథ పరారీలో ఉన్నాడు. దీంతో 20 బృందాలు నిందితుడి కోసం ఢిల్లీ, హైదరాబాద్, కరీంనగర్‌లో తీవ్రంగా గాలించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములకు లేఖ అందింది. సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాధితురాలి తరుపు న్యాయవాది పప్పు నాగేశ్వర రావు ఈ లేఖను రాశారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగితే అధికార బలంతో కేసును పక్కదారి పట్టించే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా బాధితులకు ఇటీవల బహిరంగంగా బెదిరింపులు కూడా వచ్చాయని, అందువల్ల తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది ఆ లేఖలో డిమాండ్ చేశారు. ‘మా అబ్బాయి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చట్టం పైఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణ కోసం అప్పగించా’నని బండి సంజయ్ మీడియాతో అన్నారు. ‘నేను ఇంతకు ముందే చెప్పిన. చట్టం ముందు నా బిడ్డైనా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడు.

# పిల్లలే సంపద’

ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నా. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తాం. నాలుగో బిడ్డ పుడితే.. రూ.40 వేలు ఇస్తాం. పిల్లలు భారమనుకోకూడదు.. వాళ్లే సంపద అని గుర్తించాలి. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నాం. భగవంతుడు కరుణిస్తే.. ఈ మొత్తాన్ని పెంచుతాం అని అన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశాం. ప్రజల ఆస్తులన్నీ మార్చేసి గందరగోళం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టాం. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేల చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ‘పిల్లలే సంపద’ పేరుతో త్వరలోనే ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన ‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. జనాభా తగ్గుదల రేటు ఆందోళన కలిగిస్తోందని, దేశ ప్రగతికి పిల్లలే అసలైన సంపద అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఆయన గుర్తుచేశారు. గతంలో కుటుంబ నియంత్రణపై దృష్టి సారించామని, కానీ మారిన పరిస్థితుల్లో జనాభాను దేశానికి సంపదగా మార్చేందుకు ‘పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ’ని తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే ‘తల్లికి వందనం’ కింద రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, తల్లీబిడ్డలకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## 19 నుంచి పుతిన్ చైనా పర్యటన

రష్యా అధ్యక్షుడి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. చైనా ప్రధాని లీ కియాంగ్‌తో ఆర్థిక, వాణిజ్య సహకారంపై కూడా పుతిన్ చర్చించనున్నారు. 2001లో మంచి పొరుగు సంబంధాలు, స్నేహపూర్వక సహకార ఒప్పందంపై రష్యా, చైనా సంతకాలు చేసి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన జరుగుతున్నదని రష్యాకు చెందిన టాస్ వార్తా సంస్థ పేర్కొన్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్ పర్యటన ముగించుకుని వెళ్లిపోయిన మరుసటి రోజు పుతిన్ పర్యటన ఖరారు కావడం గమనార్హం.

## తమిళనాడు సిఎం, మంత్రులకు శాఖల కేటాయింపు

చెన్నై: ముఖ్యమంత్రి విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను ఉంచుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు అప్పగించారు. పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను ఆదవ్ అర్జునకు కేటాయించారు. ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు అప్పగించారు. ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ.సెంగొట్టయ్యన్‌కు అప్పగించగా.. ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కి కేటాయించారు. స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు అప్పగించారు. మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు

కేటాయించగా.. ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను సెల్వి ఎస్.కీర్తనకు అప్పగించారు. ఆయా శాఖలను మంత్రులకు కేటాయిస్తూ లోక్ భవన్ ప్రకటన విడుదల చేసింది. తమిళగ వెట్రి కళగం అధినేత జోసెఫ్ విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా మే 10న ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విజయ్‌తో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఎన్.ఆనంద్, ఆదవ్ అర్జున, అరుణ్ రాజ్, సెంగొట్టయ్యన్, బి.వెంకటరమణన్, నిర్మల్ కుమార్, రాజ్ మోహన్, డాక్టర్ టి.కె.ప్రభు, ఎస్.కీర్తనలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు.

# జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లకు తాళం వేసి ఉంటే బీఎల్‌ఓలు కనీస పర్యాయాలు ఆ ఇళ్లకు వెళ్లి ఎన్యూమరేషన్ ఫారం ఇస్తారని స్పష్టం చేశారు. ఓటర్లకు సంబంధించిన పాక్షిక సమాచారంతో ఈ ఫారాలను ముందే ముద్రిస్తారన్నారు. మిగిలిన సమాచారాన్ని ఓటర్లు పూరించి ఒక ఫారం ప్రతిని తిరిగి బీఎల్‌ఓలకు జూలై 24లోగా అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ దశలో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని భర్తీ చేసి సమర్పించవచ్చని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ప్రారంభం కానున్న ‘సర్--2026’ కార్యక్రమంపై శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**ముసాయిదాలో ఈ ఓటర్ల తొలగింపు**

‘అందుబాటులో లేని/వలసవెళ్లిన/చనిపోయిన(అబ్సెంటీ, షిఫ్టెడ్, డెడ్) ఓటర్లను ముసాయిదా జాబితాలో తొలగిస్తారు. ఆయా కారణాలతో ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వలేకపోయిన ఓటర్ల జాబితాలను స్థానిక పోలింగ్ బూత్ వద్ద ప్రదర్శిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,68,18,902 పురుష, 1,71,02,883 మహిళా, 2,879 ట్రాన్స్‌జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 3,39,24,664 మంది ఓటర్లున్నారు. వీరిలో 2,18,39,741 మంది (64.38శాతం) ఓటర్లను సర్--2002 జాబితా మేరకు మ్యాపింగ్ పూర్తి చేశాం. ముసాయిదా ఓటర్ల జాబితాలో స్థానం పొందినప్పటికీ సర్--2002 జాబితాతో మ్యాపింగ్ కాలేకపోయినా, ఒక వేళ మ్యాపింగ్ జరిగినప్పటికీ పేర్లు, ఇతర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నా.. వారిని జూలై 31 --సెప్టెంబర్ 28 మధ్య కాలంలో నోటీసులిచ్చి విచారణకు పిలుస్తారు. ఇలా నోటీసులు అందుకునే ఓటర్ల జాబితాలను ఓటర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో)లు ప్రచురిస్తారు. ఈసీ నిర్దేశించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని తమ పుట్టిన తేదీ/పుట్టిన ప్రాంతం రుజువుగా విచారణ సమయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డును ఓటరు గుర్తింపు నిర్ధారణకు అనుమతిస్తారు..’అని సీఈఓ వివరించారు. వివరాల్లో వ్యత్యాసాలుంటే ఎదురయ్యే పరిస్థితులపై సీఈఓ ఒక ఉదాహరణ తెలిపారు. సర్--2002 ఓటర్ల జాబితాలో తన తండ్రి పేరు ‘నారాయణ’గా ఉండగా, ప్రస్తుత జాబితాలో ‘సి.నారాయణ’గా ఉండడంతో తాను సైతం విచారణకు హాజరై ‘మా నాన్న నారాయణే’అని రుజువులు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు/దరఖాస్తులను జూలై 31--ఆగస్టు 30 మధ్య స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. జూలై 31--సెప్టెంబర్ 28 మధ్య నోటీసుల జారీ/విచారణ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

## ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

కుమ్మక్కై దేశ విద్యా వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయని, ఫలితంగా 22 లక్షల మంది నీట్ అభ్యర్థుల ఆకాంక్షలు వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ‘నీట్‌కు రెండు రోజుల ముందుగానే వాట్సాప్‌లో ప్రశ్నపత్రం లీకైన విషయం దేశం యావత్తూ తెలిసిపోయింది. ఈ విషయంలో తానేమీ చేయలేనని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారు. ప్రశ్న పత్రాల లీకేజీల కట్టడికి పార్లమెంట్ కమిటీ చేసిన సిఫారసులను ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ప్రతిపక్ష సభ్యులు ఆ కమిటీలో ఉండటమే ఇందుకు కారణం’అని రాహుల్ ఎక్స్‌లో విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. ‘దేశం మూలాలపైనే మీ ప్రభుత్వం దెబ్బకొట్టింది. కేవలం డబ్బు సంపాదన కోసమే విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, ప్రొఫెసర్ల పదవుల్లో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ సంబంధీకులను కూర్చోబెట్టారు. ఇదో పెద్ద అక్రమ కూటమి’అని రాహుల్ ఆరోపించారు. ఈ కూటమి దేశ విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందన్నారు. ‘ఓ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అవ్వాలంటే కావాల్సింది పరిజ్ఞానం అనుభవం కాదు, ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన వ్యక్తి అయి ఉంటే చాలు. ఈ విషయం దేశంలో అందరికీ తెలుసు’అని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా లేని వారు వైస్ చాన్స్‌లర్ అయ్యే అవకాశమేలేదన్నారు. అందుకే, ఇప్పటి వరకు కనీసం 80సార్లు పరీక్ష పేర్లు లీకై, 2 కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని ఆరోపించారు.



# చండూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం...



ప్రభాత సూర్య చండూరు: చండూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శనివారం నాడు ఆయన మున్సిపాలిటీ పాలకవర్గం మరియు మున్సిపల్ కమిషనర్ మల్లేశంతో కలిసి శనివారం నాడు 10 అంశాలతో కూడుకున్న " మన ప్రాంతం- మన బాధ్యత" అనే బ్రోచర్లను మున్సిపాలిటీ కార్యాలయం నందు విడుదల చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ మన ఇంటి నుండి ప్రారంభమైన చిన్నచిన్న అడుగులు... చండూరు మున్సిపాలిటీకి పెద్ద మార్పు అవుతుందని అన్నారు. ప్రజలందరూ బాధ్యతతో మెలగాలని, చండూరు పరిశుభ్రత మరియు అభివృద్ధికై 10 అంశాలను ఈ బ్రోచర్లో వివరించామని, ఇందులో చెప్పిన విధంగా చండూరు అభివృద్ధికై మున్సిపాలిటీలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు. మెయిన్ రోడ్డు మీద ఫ్లెక్సీలు ఉండకూడదని, రోడ్డుకిరువైపులా డ్రైనేజీకి బయటి భాగాల్లోనే ఫ్లెక్సీలుపెట్టాలని తెలిపారు. మెయిన్ రోడ్లపై చెత్తను పోయరాదని, చెత్తబుట్టలను వాడి మున్సిపాలిటీ చెత్తను సేకరించే వాహనాలు వచ్చినప్పుడు వేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పందులు ఉండకుండా చర్యలు ప్రారంభమయ్యాయని, పెంపకం దారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చామని తెలిపారు. మెయిన్ రోడ్లపై వ్యాపారం నిర్వహించే తోపుడు బండ్లు డ్రైనేజీ బయట భాగంలో పెట్టుకోవాలని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వృధాగా ఎక్కడైనా నీరు పోతే మున్సిపాలిటీకి తెలియపరచాలని తెలిపారు. ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరగకుండా ప్లాట్ల యజమానులు చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ను వాడకుండా కాగితము మరియు బట్ట సంచులను వాడాలని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న గృహములకు అనుమతిని తీసుకోవాలని, ఇంటి పన్ను చెల్లించాలని, దుకాణం దారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. ప్రజలను చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. వీటితోపాటు ప్రజలు సెల్ ఫోన్ లు మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, టూ వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని, డ్రగ్స్ ఎవరైనా వాడుతున్నారని తెలిసే తెలిస్తే పోలీసులకు తెలపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పైన తెలుపబడిన అన్ని అంశాలతో ఉన్న బ్రోచర్లను విడుదల చేసి ప్రజలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. వీటన్నింటిని చండూరు మున్సిపాలిటీ పాలకవర్గం విజయవంతం చేయుటకు కంకణ బద్ధులై ఉన్నారని తెలిపారు. ఇప్పటికే పరిశుభ్రతలో భాగంగా చండూరులోని అన్ని డ్రైనేజీల్లో ప్రతినెలా బ్లీచింగ్ చల్లిస్తున్నామని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామని, ప్రతిరోజు రోడ్లను శుభ్రం చేయిస్తున్నామని, మున్సిపాలిటీలోని అన్ని కాలనీలలో మంచినీటిని అందిస్తున్నామని, త్వరలోనే సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని, మున్సిపాలిటీని అభివృద్ధిలో పయనింపజేస్తూ, ప్రజల మనలను పొందుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కమిషనర్ మల్లేశం, కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, బుషిపాక వాసు, సామ సుజాత యాదవ రెడ్డి, జెల్ల ధనమ్మ శ్రీనివాసులు, కొండ్రెడ్డి మధు, కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పారిజాత జనార్ధన్, కటకం రమేష్, కోఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, ఖలీల్, మొగుదాల వెంకన్న, షరీఫ్, సాయిరాం, అరవింద్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.



## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

### తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 16 ప్రభాత సూర్య : దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పై రూ. 3 రూపాయలు పెంచడం అత్యంత దారుణమని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ 16వ వార్డు తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ... ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న తరుణంలో తిరిగి ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ పై లీటరుకు మూడు రూపాయలు అదనంగా పెంచి, కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరిచిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్న రాబోయే రోజుల్లో దేశంలో పెట్రోల్, డీజల్ ధరలు ఏమాత్రం పెంచబోమని ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాన నరేంద్రమోడీ మాట ఇచ్చారని, మరి ఇప్పుడు ఓట్ల కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పి ఎన్నికల ముగిసి మూడు వారాలైనా కాగానే ఒక్కసారిగా పెట్రోల్ డీజిల్ పై అధిక ధరలు పెంచి దేశ ప్రజలను మోసగించడం తగదన్నారు. పెట్రోల్, డీజిల్ పెరగటం వల్ల నిత్యవసర సరుకులు కూడా పెరిగే అవకాశం ఉందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం వల్ల సామాన్య ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

## అల్లందేవిచెరువు పల్లె దవాఖానకు వైద్యుడిని నియమించాలి

### సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్



**సంస్థాన్ నారాయణపురం, మే 16(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని అల్లందేవిచెరువు గ్రామ పల్లె దవాఖానలో వైద్య సేవలు సక్రమంగా అందించేందుకు వైద్యుడిని నియమించాలని గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ మండల వైద్యాధికారి రవీనాకి వినతిపత్రం అందజేశారు.గ్రామ ప్రజలు ప్రస్తుతం వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని,ముఖ్యంగా వృద్ధులు,గర్భిణీలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ వివరించారు.గ్రామానికి క్రమం తప్పకుండా వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రవీనా సానుకూలంగా స్పందించి, పై అధికారులతో మాట్లాడి అల్లందేవిచెరువు గ్రామానికి వారానికి కనీసం రెండుసార్లు వైద్యుడిని పంపించి గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బిసి స్టడీ సర్కిల్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లైఫ్ స్కిల్స్ పై 4 రోజుల వర్క్ షాప్

### ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

### ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి శ్రీలత



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** ఖమ్మం బిసి స్టడీ సర్కిల్ లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)అండ్ లైఫ్ స్కిల్స్ పై జూన్ 8 నుండి జూన్ 11 వరకు నాలుగు రోజుల వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుంది.విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాథమిక అంశాలు వివిధ అప్లికేషన్లపై అవగాహన కల్పించడం మరియు జీవనోపాధి కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే విధంగా తీర్చిదిద్దడం ఈ వర్క్ షాప్ ప్రధాన లక్ష్యం.ఈ కార్యక్రమానికి ఆసక్తి కలిగిన ఖమ్మం కొత్తగూడెం జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 18 నుండి జూన్ 6 లోపు ఖమ్మం నగరం ఎన్టీఆర్ సర్కిల్ బైపాస్ రోడ్డు నందు గల బీసీ స్టడీ సర్కిల్ నందు నేరుగా ధరఖాస్తు అందజేయగలరని ఖమ్మం బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు.ఇతర వివరాలకు ఫోన్ 08742-230848 మరియు 9441931359 ను సంప్రదించగలరని తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం

### సోనియా గాంధీ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (రిజిస్టర్డ్ సంఘం) ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్డి నంబర్ 679 ను జారీ చేసినందుకు ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేవి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న ఉద్యమకారుల చిరకాల కోరిక నెరవేరుతున్న సందర్భంగా ఉద్యమకారులంతా చాలా ఆనందంతో ఉన్నారు గాని కమిటీ యొక్క విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని కాలయాపన చేయకుండా శ్రీకృష్ణ కమిటీ లాగా ఊరూ ఊరూ వాడ వాడ తిరిగి ఉద్యమకారులను నాయకులను నేరుగా కలిసి గుర్తింపు కార్డులను జారీ చేసి తుది నివేదికను తయారుచేసి తక్కువ టైంలో ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య గుంతేటి వీరభద్రం పగడాల నరేందర్ బచ్చల పద్మాచారి షేక్ అబ్బాస్ బత్తిన మధుగౌడ్ లింగనబోయిన సతీష్ కూరపాటి సుశీల రవిచంద్ర చౌహాన్ బాలిన భాస్కర్ రెడ్డి దరిపల్లి వీరబాబు మోత్కురి వేంకటేశ్వరా చారి భుక్య శ్రీనివాస్ నాయక్ దొడ్డ శ్రీనివాస్ రెడ్డి కోడిరెక్క ఉమాశంకర్ గాజుల రవి కుమార్ ఆసిఫ్ బురాన్ కోటేశ్ యాదవ్ రెడ్డబోయిన వరలక్ష్మి గ్లోరి కమలమ్మ ధనలక్ష్మి స్వరూప కోసూరి వీరబాబు పగడాల నాగరాజు పగడాల శీను గాలి రాము ఇనుప శీను లంజేపల్లి బాబు నార్పొంగు వెంకట్ పరికపెల్లి ఎల్లయ్య ఎస్ కే యాకూబ్ సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ మెరుగుకు సహకరించాలంటూ ఎమ్మెల్యే బిఎల్ఆర్ అవగాహన ర్యాలీ





మిర్యాలగూడ , మే 26:- (ప్రభాత సూర్య): మిర్యాలగూడలో ట్రాఫిక్ నియాత్రణపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ స్పెషల్ డ్రైవ్ ట్రాఫిక్ నియంత్రణపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధ బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డిఎస్పీ కె.రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పోలీస్, మున్సిపల్ అధికారులతో కలసి వారు రోడ్లపై పర్యటించారు. వ్యాపారులు, వాహనదారులకు ట్రాపిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలని, రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని వారు సూచించారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమనర్సయ్య, ఎస్ఐలు రాంబాబు, కృష్ణయ్య, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు బాలకృష్ణ, నవీన్, పోలీస్, మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలి

**గట్టుపల్ ప్రభాత సూర్య మే16:** గట్టుపల్ మండలంలోని పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గట్టుప్పల్ మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ధరలను పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. పేదవాడు తినే తిండిపై కూడా నిత్యవసర వస్తువులపై జిఎస్టి విధించి తిండిపై కూడా ఆంక్షలు విధించి పేదల నోటికాటి ముద్దను కొల్లగొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు రాపోలు సత్తయ్య, ఐతరాజు లక్ష్మయ్య, కారింగు శ్రీను, దుబ్బాక రాములు , కట్ట




చెన్నయ్య, బాల లింగయ్య, సుధాకర్ రెడ్డి, కొండపల్లి ముత్యాలు, పార్టీ నాయకులు శాఖ కార్య దర్శిలు పాల్గొన్నారు

## దుర్గామాత ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు.సన్మానం చేయడం జరిగింది



గట్టుపల్ ప్రభాత సూర్య మే. 16:గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో.దుర్గామాత ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ పదవ తరగతి ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ వచ్చిన టేకుమట్ల స్ఫూర్తి విద్యార్థిని అభినందించి.సన్మానించడం జరిగినది మన ఊరు పిల్లలను. మన పాఠశాలకే పంపించాలని ప్రైవేటు స్కూల్లోకి దీటుగా మన ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చెప్పారుఈ కార్యక్రమంలో గంగనబోయిన మహేష్ కంపే శ్రీశైలం భీమనపల్లి శంకర్ కర్నాటి రామ.టేకుమట్ల మహేష్ .టేకుమట్ల రాజు వల్లూరి విక్రమ్ తదిపర్లు పాల్గొనడం జరిగినది

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి జక్కలి రాజు యాదవ్ నియామకం

### మునుగోడులో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యం: రాజు యాదవ్



**సంస్థాన్ నారాయణపురం, మే 16(ప్రభాత సూర్య ):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జక్కలి రాజు యాదవ్ రెండోసారి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో మరోసారి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.?ఈ సందర్భంగా జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచక, మోసపూరిత పాలనకు చరమగీతం పాడతామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మునుగోడు గడ్డపై కాషాయ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.?ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి తెలంగాణ ప్రజల అభ్యున్నతి కోసం ఒక సైనికుడిలా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల (ఓ.బి.సి) సంక్షేమం కోసం, పేదల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అలుపెరగని పోరాటం చేస్తానని చెప్పారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ, నాయకత్వం అప్పగించిన ప్రతి బాధ్యతను క్రమశిక్షణతో నెరవేరుస్తానని రాజు యాదవ్ పేర్కొన్నారు.?తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు , ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్, డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, ముఖ్య నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసిన సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య



**సంస్థాన్ నారాయణపురం, మే 16(ప్రభాత సూర్య ):** తీవ్రమైన ఎండల దృష్ట్యా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు శనివారం వడదెబ్బ తగలకుండా తగు రక్షణ చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం గ్రామ సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య,పంచాయతీ కార్యదర్శి ఎస్. సంతోష, ఆశా వర్కర్ రాచకొండ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ కోడూరు రాములు పాల్గొని కూలీలకు ప్యాకెట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు కూలీలకు పలు కీలక సూచనలు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలందరూ వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేసుకోవాలని కోరారు. అలాగే, ఉపాధి హామీ నియమాల ప్రకారం కూలీలందరూ తప్పనిసరిగా ఉదయాన్నే పని వద్దకు రావాలని, ఉదయం మొదటి ఫోటో, మధ్యాహ్నం రెండో ఫోటో దిగిన తర్వాతనే ఇంటికి వెళ్ళవలసి ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామంలోని కూలీలందరూ అధిక సంఖ్యలో వచ్చి ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## ట్రాఫిక్ మెరుగుకు సహకరించాలంటూ ఎమ్మెల్యే బిఎల్ఆర్ అవగాహన ర్యాలీ






**మిర్యాలగూడ , మే, 116:-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడలో ట్రాఫిక్ నియాత్రణపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ స్పెషల్ డ్రైవ్ ట్రాఫిక్ నియంత్రణపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధ బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డిఎస్పీ కె.రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.పోలీస్, మున్సిపల్ అధికారులతో కలసి వారు రోడ్లపై పర్యటించారు. వ్యాపారులు, వాహనదారులకు ట్రాపిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలని, రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని వారు సూచించారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమనర్సయ్య, ఎస్ఐలు రాంబాబు, కృష్ణయ్య, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు బాలకృష్ణ, నవీన్, పోలీస్, మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# బోరు గుంతలో మనవడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన తాత

### పోలిసుల రెస్క్యూ ఆపరేషన్ కు ప్రజల హర్షం





**మిర్యాలగూడ , మే16:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి గ్రామ శివారులో శనివారం హృదయ విదారక ఘటన జరిగింది. ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు బోరు గుంతలో పడిపోయిన నాలుగేళ్ల చిన్నారి అభిలాష్. నా మనవడిని కాపాడాలంటూ ప్రాణాలను పణంగా పెట్టి బోరు గుంతలోకి దిగిన తాత కంటు వెంకన్న అయితే లోతైన బోరు గుంతలో తలకిందు లుగా పడి ఊపిరాడక ఇద్దరూ ఇరుక్కుపోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలకు గురై స్థానికుల కేకలతో అప్రమత్తమై మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారమిచ్చిన గ్రామస్థులు, పోలీసు రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి పరుగులు తీసి ప్రాణాలను లెక్కచేయకుండా గంటల పాటు ఉత్కంఠభరిత రెస్క్యూ ఆపరేషన్ సాగింది.చివరికి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసిన పోలీసులు. అయితే అప్పటికే తీవ్ర అస్వస్థతకు గురైన వెంకన్న పరిస్థితి విషమించడంతో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకన్న మరణించారు. మనవడి కోసం ప్రాణత్యాగం చేసిన తాత సంఘటనతో ఊట్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామమంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏరియా ఆసుపత్రిలో వెంకన్న మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సహాయక చర్యలు (రెస్క్యూ) చేపట్టి ప్రాణం కాపాడిన రూరల్ ఎస్ఐ ఎం.లక్ష్మయ్య, పోలీసులను ప్రజలు ప్రశంసింశించారు. కంటు వెంకన్న తన పొలం దగ్గరకు మనవడు అభిలాష్ మనవరాలతో కలిసి వెళ్ళరు. బోరు కేసింగ్ పైపు మనవడు గుంటలోకి పడగా తనని చూసే సమయంలో తలకిందులుగా కంటు వెంకన్న బోరు గుంటల పడడంతో తీవ్ర అస్వస్థత గురై అంబులెన్స్ లో తరలిస్తుండగా కన్నుమూయడం విషాదానికి గురి చేసిందని పార్థివ దేహానికి యాద్గార్ పల్లి సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి వస్కుల సూర్యం, సిపిఎం మండల కమిటీ సభ్యులు కన్నెకంటి రామకృష్ణ, సీఐటీయూ నాయకులు రామాచారి, సభ్యులు, పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ, కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

### రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని ఉద్యమాలు చేస్తుంటే అరెస్టులు చేయడం దుర్మార్గం.. పల్లగొర్ల మోదీరాందేవ్




**రామన్నపేట, మే 16(ప్రభాత సూర్య ):** రామన్నపేట మార్కెట్లులలో ధాన్యం పోసి 2నెలలు దాటిన ధాన్యం కొనుగోలు చేయట్లేదని యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని రైతు సంఘాలు పిలుపుమేరకు పెద్ద తుమ్మలగూడెం రైతుల ఆధ్వర్యంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్, ఎడ్ల మహాలింగం బయలుదేరి రామన్నపేటకు వచ్చిన క్రమంలో అరెస్టు చేసి రామన్న పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కలెక్టరేట్ వద్ద 11:30 కు ధర్నా చేయాలని రైతు సంఘాల పిలుపుమేరకు భువనగిరికి బయలుదేరుతున్న క్రమంలో పోలీసులు ఫోన్ లొకేషన్ ట్రాక్ చేసి రామన్నపేట పిఎస్ మెయిన్ రోడ్డు వద్ద ఎస్సై నాగరాజు వారి బృందం20 మంది పోలీసులతో కలిసి అరెస్టు చేశారు సాయంత్రం 6 గంటలకు విడుదల చేశారు ఈ క్రమంలో రైతు సంఘం నాయకులకు పోలీసులకు వాగ్వాదం జరిగింది రోడ్డుపై నుండి రౌడీలను గూండాలను అరెస్టు చేసినట్టుగా బలవంతంగా గుంజుకొచ్చి అరెస్టు చేసే ప్రభుత్వానికి రానున్న రోజుల్లో రైతులే బుద్ధి చెప్తారు అన్నారు.రైతులు మాట్లాడుతూ మార్కెట్లలో ధాన్యం బోసి నెలలు గడుస్తున్న కొనకపోవడంతో వర్షాలతో ధాన్యం తడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు.ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, అమాలి వాళ్లను లారీలను పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచాలని రైస్ ధాన్యం స్టోరేజ్ కి గిడ్డంగులను ఏర్పాటు చేయాలని మిల్లుల దోపిడిని అరికట్టాలి క్వింటాలుకు ఐదారు కేజీలు కట్ చేస్తున్న రైస్ మిల్లులను సీజ్ చేయాలని, కాంట వేసిన24 గంటల్లో రైతులకు డబ్బులు వేయాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను తీసివేయాలని ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పి రైతులను అరిగోసలు పెడుతుంది అధికారంలోకి రాగానే రైతు డిక్లరేషన్ ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పి దాన్ని ఊసే లేదు రైతు బంధు కు మంగళం పలికి, రైతు కూలీల మాటే లేదు, రైతే రాజు చేస్తామని చెప్పి రైతులపైనే రాజకీయం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తాం అన్నారు. కనుక వెంటనే ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలి ఎలాంటి కటింగ్ లేకుండా చూడాలి 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు పడేలా చేయాలని రైతులన్నారు ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ యువజన సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం పాల్గొన్నారు.



## ప్రతి శనివారం భక్తి సేవలతో ఆకట్టుకుంటున్న మెట్టు కుమార్ యాదవ్.



**పటాన్చెరు, మే 16,(ప్రభాత సూర్య ):** పటాన్చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమం ఈరోజు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ సహోదరులు మెట్టు ఎల్లేష్ యాదవ్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులకు స్వయంగా ఆహారం వడ్డించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు మాట్లాడుతూ, ప్రతి శనివారం మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రామాలయంలో భక్తిపూర్వకంగా పూజలు నిర్వహిస్తూ స్థానిక ప్రజలు, భక్తులు, బాటసారులకు నిరంతరం అన్నదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటీవల జన్మదిన వేడుకలు జరుపుకున్న మెట్టు కుమార్ యాదవ్‌కు ఈ సందర్భంగా భక్తులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్ రాజు, మెట్టు కళ్యాణ్ యాదవ్, సన్నీ యాదవ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు చలువ పందిరి ఏర్పాటు చేయించిన గోవిందరాజు పల్లి సర్పంచ్ బండమీది రాజు

**ప్రభాత సూర్య నర్సాపూర్ మే16:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గోవింద్ రాజ్ పల్లి గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీలకు స్తానిక సర్పంచ్ బండమీది రాజు,ఉప సర్పంచ్ కాలాలి కృష్ణా గౌడ్ చలువ పందిరి ఏర్పాటు చేశారు.అదేవిధంగా కూలీలకు మజ్జిగ త్రాగునీటినీ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బండమీది రాజు మాట్లాడుతూ ఎండలు విపరీతంగా పెరిగాయని,ఉపాధి కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా ఉండడానికి చలువ పందిరి ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.ఎండ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంటా రెడ్డి,గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల్లో విద్యార్థిని అభినందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్

**తుర్కపల్లి, మే 16 ప్రభాతసూర్య:** విద్యా వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తుర్కపల్లి మండలం మోడల్ స్కూల్ విద్యార్థిని జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు అభినందించారు. క్రీడారంగంలో జాతీయస్థాయి లో ఆడిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఏయమల అంజలి వాలీబాల్ స్కూల్ గేమ్స్ అండర్ 19 విభాగంలో జాతీయస్థాయిలో మధ్యప్రదేశ్ లో జరిగిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నది. తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో చదువుతున్న ఇంటర్ సెకండియర్ సిఇసి చదువుతున్న వాసాలమర్రి విద్యార్థిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లె రమేష్ రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు



# పొదుపు పేరుతో ప్రజలను మోసం చేస్తున్న మోడీ

## ప్రజలను సౌకర్యాలు తగ్గించుకోమని తాను మాత్రం విదేశాలు తిరుగుతుండ్రు

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు






**భువనగిరి, మే 16(ప్రభాత సూర్య ):** పొదుపు పేరుతో ప్రజలను బిజెపి మోడీ ప్రభుత్వం మోసం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు విమర్శించారు. ప్రజలను సౌకర్యాలు తగ్గించుకోమని చెప్పి విదేశాల్లో మోడీ ఎంజాయ్ చేస్తున్నాడని వారు ఎద్దేవ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సుందరయ్య భవన్, భువనగిరిలో జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారతావనిలో పేదలు మరింత పేదలుగా ధనికులు మరింత ధనికులుగా పెరిగిపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గ్రామీణ వ్యవసాయ కూలీలు, పేదలు పని దొరకక కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మోడీ అధికారం చేపట్టిన తర్వాత పోరాడి సాధించుకున్న అనేక హక్కులు, చట్టాలు కాల రాయబడుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగా ఉపయోగపడే ఉపాధి హామీ పనిని విబి- జి రామ్ జి పథకముగా మార్చి చట్టానికి ఉరేషారని అన్నారు. రోజురోజుకు కార్పొరేటికరణ, ప్రైవేటీకరణ పెరగడం వల్ల రిజర్వేషన్లు మొత్తం పోయి పేదలకు ఉన్న కాస్త ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందే పరిస్థితిలో లేవని అన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయ కూలీలు వ్యవసాయతర కార్మికులుగా మారారని వారందరికీ ఉపాధి కోసం సమగ్ర చట్టాన్ని తీసుకొచ్చి పెరుగుతున్న దరుల కనుగుణంగా కనీస వేతనాల చట్టాన్ని ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో దేశవ్యాప్తంగా పేదల సమస్యల పరిష్కారం కోసం, భూ పంపిణీ కోసం, ఉపాధి రక్షణ కోసం అన్ని వర్గాలను సమీకరించి పోరాటాలను కొనసాగిస్తామని వారు తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలు రామన్నపేట మండల కేంద్రంలో మే 18, 19 తేదీలలో నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా మే 18న సాయంత్రం భారీ బహిరంగ సభ, 19న ప్రతినిధుల మహాసభ జరుగుతుందని ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి. జహంగీర్, వివిధ ప్రజా సంఘాల నాయకులకు కూడా పాల్గొంటున్నారని తెలిపారు. బహిరంగ సభలో, ప్రతినిధుల మహాసభలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, గుంటూరు శ్రీనివాస్ చారి, సల్లూరి కుమార్, కూకుట్ల చుక్కాకుమారి జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, బోయ యాదయ్య, చింతకాయల నరసింహ, కొండాపురం యాదగిరి, శ్రీనివాసరావు, రాపోతు పద్మ, మానే సాలయ్య, బొల్లేపల్లి కిషన్, ఎర్ర ఊషయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్

## గుండెపోటుతో మరణించిన కార్మికుడి కుటుంబానికి 5 లక్షల 50 వేల రూపాయల నష్టపరిహారం అందజేత





**పటాన్చెరు, మే 16,ప్రభాత సూర్య :** కార్మిక రంగానికి పెద్దపీటవేస్తూ వారి సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరో సారి కార్మిక రంగం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. గుండెపోటుతో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే..ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల స్మార్కో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాంటాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి (35) మూడు రోజుల క్రితం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. అత్యంత నిరుపేద కుటుంబం నేపథ్యం కలిగిన కృష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం 5 లక్షల రూపాయలు నష్టపరిహారంతో పాటు 50 వేల రూపాయలు అంత్యక్రియల ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం డబ్బులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నేపద్యం నుండి రాజకీయాల్లోకి వచ్చిన తనకు కార్మికుల కష్టనష్టాలు తెలుసునని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కార్మిక రంగానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా పటాన్చెరు అధ్యక్షులు సుధీర్ రెడ్డి, పాశమైలారం వైస్ చైర్మన్ రాఘవరెడ్డి, ప్రతినిధులు ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, రమణారెడ్డి. లక్ష్మణరావు, సురేష్. రంజిత్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, చంద్రశేఖర్, మధు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



# టి ఆర్ పి పార్టీని బలోపేతమై ముందుకు నడిపించాలి... జిల్లా అధ్యక్షులు..

**ఆలేరు మే 16 ప్రభాత సూర్య:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు కొమరిశెట్టి నరసింహులు ఆధ్వర్యంలో శనివారం స్థానిక టి.ఆర్.పి పార్టీ ఆలేరు మండలం అధ్యక్షునిగా చింతపండు వెంకటేష్ ను ఆలేరు పట్టణ అధ్యక్షునిగా చెక్క రవి, పట్టణ ఉపాధ్యక్షునిగా కొండ పరమేష్ లకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మీ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతమై ముందుకు నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉషా చింతకింది, లూనావత్ నరేందర్, లక్ష్మణ్ నాయక్, నవీన్ నాయక్, సంగురాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌కు షాక్..

# దేశం వీడకుండా లుకౌట్ నోటీసులు

- మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న భగీరథ్
- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- ఇప్పటికీ పోలీసులకు చిక్కని వైనం
- బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్న పోలీసులు

మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే నిందితుడు దేశం దాటిపోకుండా ఉండేందుకు పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయించారు. భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ప్రస్తుతం పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు ఇందులో భాగంగా బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక పోలీసు బృందం సోదాలు నిర్వహిస్తోంది. భగీరథ్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నవారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. అతని స్నేహితులు, బంధువుల ఇళ్లపై కూడా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచా రం. నిందితుడి జాడ కనిపెట్టేందుకు అన్ని కోణాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. మరోవైపు ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విషయంలో భగీరథ్‌కు హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘ విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ఏసిబి కి చిక్కిన అవినీతి తిమింగలం.....





**ఆలేరు మే 16 ప్రభాత సూర్య..: యాదాద్రి భువనగిరి జిల్లా:** మోటకొండూరు మండలంలోని మేడికుంట పల్లి గ్రామానికి చెందిన రైతు అనంతరెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్,7 విద్యుత్ స్తంభాలు బిగించేందుకు 35 వేల రూపాయలు లంచం అడిగిన అసిస్టెంట్ లైన్మెన్ రమేష్.2 నెలల క్రితం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు 30 వేల తో డిడిలు చెల్లించిన రైతు.విద్యుత్ ట్రాన్స్ఫర్ బిగించాలని పలుమార్లు ఏఈ,అసిస్టెంట్ లైన్మెన్లను కోరిన రైతు.విద్యుత్ ట్రాన్స్ఫర్ బిగించిన అనంతరం 10,000 ఇస్తానని చెప్పిన రైతు అనంత రెడ్డి.ట్రాన్స్ఫార్మర్ బిగించేందుకు 35,000 రూపాయలు లంచం కావాలని రైతు అనంతరెడ్డిని అడిగిన అసిస్టెంట్ లైన్మెన్ రమేష్.విసుకు చెందిన రైతు అనంతరెడ్డి 2రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.గత రెండు రోజులుగా రెక్కి నిర్వహించిన నల్గొండ ఏ,సి,బి డీఎస్పీ జగదీష్ బృందం రైతు అనంతరెడ్డి ఇంటి వద్ద 35000 వేల రూపాయలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోడి రెక్క శౌరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి ,ఎమ్మెల్సీ



**మిర్యాలగూడ మే 16:- (ప్రభాత సూర్య):** సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోడిరెక్క శౌరి మిర్యాలగూడలో శనివారం ఉదయం మరణించారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నిజాయితీ, నిక్కచ్చితనంతో ప్రజల మనసులు గెలుచుకున్న నాయకుడిగా శౌరికి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మాజీ మంత్రి, సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి కోడి రెక్క శౌరి మృతి పట్ల సంతాపం తెలిపారు. ప్రజాసేవలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. శౌరి మరణం కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

# తెలంగాణలో మార్పు రావాలి రా ష్ట్రీయ లోకు దళ్ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్....



**ఆలేరు, మే 16 ప్రభాత సూర్య:** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి కే. కేశవరావును ఛైర్మన్‌గా నియమించడం హాస్యాస్పదమని రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణం రహదారి బాంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కే. కేశవరావు దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనుచరుడిగా ఉండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆయన కుమార్తెకు మేయర్ పదవి ఇవ్వడం పెద్ద తప్పిదమైతే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమించడం కూడా అభ్యంతరకరమని విమర్శించారు.తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు ఇప్పటికీ పరామర్శ కోసం ఎదురు చూస్తున్న సమయంలో ముఖ్యమంత్రి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమన్నారు.అలాగే జూన్ 27న వరంగల్‌లోని కేఐటీఎస్ కళాశాలలో రాష్ట్రీయ లోక్ దళ్ ఆధ్వర్యంలో రోజ్‌గార్ స్కిల్ అండ్ లోన్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర యువజన అధ్యక్షులు రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అదే రోజు “లక్ష్యం కోసం లక్ష సైన్యం” పేరుతో రిటైర్డ్ ఆర్మీ అధికారుల ఆధ్వర్యంలో లక్ష మంది యువత నియామక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం, ఆరోగ్యకరమైన రాజకీయాలలో యువత భాగస్వామ్యం పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశం లో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గౌర బీరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విక్రమ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో సీట్లు కైవసం చేసుకున్న బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు

శిరివెళ్ల: ప్రతిభను వెలికి తీసి ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం :- ప్రిన్సిపల్ మురళీమోహన్ మలిశెట్టి. శిరివెళ్ల (నంద్యాల, బొమ్మల సత్రం):- నంద్యాల పట్టణంలోని ద్వారకామయి కాంప్లెక్స్ బొమ్మల సత్రంలో వెలసినటువంటి బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగినటువంటి నవోదయ ప్రవేశ పరీక్షల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. చిక్కుడు వెంకట లహరి, పటాన్ నాజియ బాలికలు నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా జరిగినటువంటి ఎంట్రన్స్ పరీక్షల్లో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని తమ బ్రిలియంట్ స్టాండర్డ్ మెమోరీతో బనవాసి నవోదయలో సీట్లను సుస్థిరం చేసుకున్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు ఉత్తమ విద్య అత్యుత్తమ క్రమశిక్షణ విలువలు విశ్వసనీయతకు బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ నిలయంగా మారిందని ప్రిన్సిపాల్ మురళీమోహన్ మలిశెట్టి గారు పేర్కొన్నారు. తమ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్లో ఐఐటి, నీట్, సివిల్, ఫౌండేషన్, నవోదయ, సైనిక్, ఆర్ ఎం ఎస్ వంటి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవిధంగా నాలుగవ తరగతి నుండి పదవ తరగతి వరకు సిలబస్ అర్థమయ్యే పద్ధతిలో నూతన టెక్నాలజీకి అనుగుణంగా బోధిస్తున్నట్లు తెలిపారు. సాధారణ టెస్టులు మాక్ టెస్ట్ లు గ్రాండ్ టెస్టులతో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు చిన్నారుల ప్రతిభను వెలికి తీస్తున్నామని అన్నారు. పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచే కాలుష్య రహిత వాతావరణం రక్షణ కవచంలా క్యాంపస్ అనుభవజ్ఞులైన నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యాబోధనతో బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు పలు ప్రవేశ పరీక్షల్లో జైత్ర యాత్ర కొనసాగిస్తూ విజయభావుట ఎగురవేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్లో ఇద్దరు మహిళల హత్య

మోయినాబాద్: మోయినాబాద్ లో ఒక ఫామ్ హౌజ్ లో ఇద్దరు మహిళల దారుణ హత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తోల్కట్ట గ్రామ సమీపంలో శవాలైన తాండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మిస్సైయారు. తాండూరు నుండి వృద్ధ మహిళలను తీసుకువెళ్లి హైదరాబాద్ శివారు ప్రాంతమైన చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామ సమీపంలో గల ఫామ్ హౌస్ దగ్గర నిర్మానుష్య ప్రదేశంలో హత్య చేసి పూడ్చివేసారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి...

కొలిమిగుండ్ల మే 16: సంజామల మండల కేంద్రంలో ఇవాళ రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్థానిక టిడిపి నాయకులు పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి మంత్రి రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి డాక్టర్లకు సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకట ప్రతాపరెడ్డి, సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, మంచాల మద్దిలేటి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## ఐదో అంతస్తు నుంచి కిందపడ్డ లిఫ్ట్.. ఆరుగురు బీఆర్ఎస్ నేతలకు గాయాలు

**హైదరాబాద్లో తెగిపడిన అపార్ట్మెంట్ లిఫ్ట్**

**ఆరుగురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు**

**పార్టీ సమావేశం ముగించుకుని వస్తుండగా ఘటన**

హైదరాబాద్లో పెను ప్రమాదం చోటుచేసుకుంది. లిఫ్ట్ తెగిపడటంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు నాయకులు గాయపడ్డారు. ఈ ఘటన నిన్న సాయంత్రం మణికొండ సమీపంలోని డాలర్ హిల్స్లో ఉన్న ఓ అపార్ట్మెంట్లో జరిగింది. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్ఛార్జ్ కార్తీక్ రెడ్డి తలపెట్టిన పాదయాత్రపై చర్చించేందుకు నాయకులు ఈ అపార్ట్మెంట్లోని ఐదో అంతస్తుకు వచ్చారు. సమావేశం ముగిశాక తిరిగి కిందికి వస్తుండగా, సాంకేతిక లోపంతో లిఫ్ట్ వైర్లు తెగిపోయి ఒక్కసారిగా కిందపడిపోయింది. ఈ ఘటనతో అపార్ట్మెంట్లో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ ప్రమాదంలో లిఫ్ట్లో ఉన్న ఆరుగురు నాయకులకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలైనట్టు సమాచారం. వారిని మెరుగైన చికిత్స కోసం వెంటనే జూబ్లీహిల్స్లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. మిగిలిన నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అపార్ట్మెంట్ వాసులు, ఇతర పార్టీ కార్యకర్తలు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని లిఫ్ట్ నుంచి బయటకు తీసి ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎలక్ట్రిక్ బస్సుల ప్రైవేటీకరణ తప్పనిసరి: కొనకళ్ల నారాయణ

**మహిళల ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్య**

**టికెట్ ఛార్జీలను పెంచబోమని వెల్లడి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ూ్రూా=ుజ)లో ఎలక్ట్రిక్ బస్సుల ప్రైవేటీకరణ అనేది తప్పనిసరి అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అభిప్రాయపడ్డారు. సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తు అవసరాలను వివరిస్తూ ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 10 వేల ఆర్టీసీ బస్సులు సేవలు అందిస్తున్నాయని, పర్యావరణ పరిరక్షణ కోసం వీటి స్థానంలో 10 వేల ఎలక్ట్రికల్ బస్సులను తీసుకురావాల్సి ఉందని ఛైర్మన్ తెలిపారు. అయితే, ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో ఎలక్ట్రికల్ బస్సు ధర దాదాపు రూ. కోటి 60 లక్షలు పలుకుతోందని, మొత్తం 10 వేల బస్సుల కొనుగోలుకు సుమారు రూ. 15,000 కోట్లు ఖర్చవుతుందని వివరించారు.

# రోజు కనీసం 400 లారీల ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్





**మిర్యాలగూడ మే 16:-( ప్రభాత సూర్య)** :ఐకేపీ ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని రైస్ మిల్లర్లకు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్. ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తో కలిసి మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో పౌర సరఫరాల అధికారులు, రైస్ మిల్లుల యాజమానులతో ధాన్యం ఆన్ లోడింగ్ పై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 6 లక్షల 76 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశముందని చెప్పారు. ఈ నేపథ్యంలో మిల్లర్లు జాప్యం చేయకుండా ధాన్యాన్ని అన్లోడింగ్ చేయాలని ఆదేశించారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, అవసరమైతే సుదూర ప్రాంతాల నుంచి హమాలీలను తీసుకురావాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం 400 లారీల ధాన్యాన్ని మిల్లులలో దించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల ప్రయోజనాలకై అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని, ఖాళీ అయిన ఐకేపీ కేంద్రాల హమాలీలను కూడా అన్లోడింగ్ పనులకు వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం అన్లోడింగ్ అయిన వెంటనే ట్రక్ షీట్లను తీసుకెళ్లాలని తెలిపారు. రైస్ మిల్లులు, లారీ ట్యాగింగ్ సమస్యలు ఉంటే అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మిర్యాలగూడ లారీ అసోసియేషన్ అదనంగా 50 లారీలను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తరలింపు పూర్తయ్యే వరకు సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. లారీలు, హమాలీల కొరత లేకుండా ధాన్యం రవాణా, అన్లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులకు సూచించారు. లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. మిల్లర్లు ప్రభుత్వ ధాన్యం సేకరణలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. మిగిలిన ధాన్యాన్ని 10 రోజుల్లో పూర్తిగా మిల్లులకు పంపించేయాలన్నారు. మిల్లులకు ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం వెంటనే పరిష్కరిస్తుందని , రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ శాఖలు, మిల్లర్లు, లారీ యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి వెంకటేష్, మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర్ రాజు, పౌర సరఫరాల డిఎం రాంపతీనాయక్, తహసిల్దార్ శ్రీనివాస్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గౌరు శ్రీనివాస్, బి.వెంకటరమణ చౌదరి, ఉపాధ్యక్షుడు ఘంటా సంతోష్ రెడ్డి, నవీన్ శ్రీరామ్, రైస్ మిల్స్ యజమానులు, అధికారులు పాల్గొన్నారు.

# వడ్డెర సమాజం కోసం అహర్నిశలు కృషి చేస్తా: గుంజ రేణుక నారాయణ

### వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణకు ఘన సత్కారం

### సంఘ అభివృద్ధికి అందరం ఐక్యంగా పనిచేయాలి : వల్లెపు శివకుమార్





**కుత్బుల్లాపూర్, మే 16 (ప్రభాత సూర్య):** తెలంగాణ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్గా నియమితులైన గుంజ రేణుక నారాయణను జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోదాస్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూల బొకేలు, శాలువాలతో గుంజ రేణుక నారాయణను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుంజ రేణుక నారాయణ మాట్లాడుతూ వడ్డెర సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. వడ్డెర యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం, రుణాలు, సబ్సిడీలు అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వెనుకబడిన వడ్డెర కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. వడ్డెర సమాజం ఆర్థికంగా, సామాజికంగా బలపడే విధంగా కార్పొరేషన్ ద్వారా అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్ మాట్లాడుతూ వడ్డెర సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధి కోసం కేవలం పదవులు సరిపోవని, సేవాభావంతో పని చేసినప్పుడే వడ్డెర జాతికి నిజమైన గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర కుటుంబాలు ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు సంఘం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. అత్తాపూర్లో ఉన్న జాతీయ వడ్డెర సంఘం కార్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెర ప్రజలకు సేవలు అందించే కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. యువత సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని సమాజ భవిష్యత్తు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి వడ్డెర కుటుంబానికి చేరేలా సంఘ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. వడ్డెర సమాజం రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ముందుకు రావాలంటే ఐక్యత ఎంతో అవసరమని, సంఘం కోసం పనిచేసే ప్రతి నాయకుడికి సంఘం అండగా ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో వడ్డెర సంఘానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చే విధంగా రాష్ట్ర స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, జాతీయ గౌరవ అధ్యక్షుడు లోకనాథం, జాతీయ వడ్డెర సంఘం యువజన నాయకులు వేముల భరత్, మల్లేకృష్ణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల భవాని, శివమ్మ, నారాయణ, సోమన్న, రాష్ట్ర కార్యదర్శి జెరుపటి రాజు, కృష్ణ, బొంత శ్రీను, పల్లపు నర్సింగ్ రావు, గుంజ రమేష్ యువజన నాయకులు, కార్యకర్తలు, వడ్డెర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'.. జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ

**జూన్ 25 నుంచి జులై 24 వరకు వెరిఫికేషన్ ప్రక్రియ**

**ప్రతి ఓటర్కు రెండు ఫామ్లు**

**జులై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల**


**జులై 31-ఆగస్టు 30 మధ్య అభ్యంతరాల స్వీకరణ**

**అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా**



తెలంగాణలో వచ్చే నెల 15 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాతో పంచుకున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్లు ఇస్తారని సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఓటర్కు రెండు ఫామ్లు అందుతాయన్నారు. అందులో ఒకటి నింపి తిరిగి బీఎల్వోలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రెండో ఫామ్ను ఓటరు తమ వద్దే అక్నాలెడ్జ్మెంట్ కింద ఉంచుకోవచ్చని వివరించారు. ఆన్లైన్లో ఓటర్ల నమోదు కోసం జశీవతీం.వఙఱ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫామ్ల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. దీన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. అలాగే వెబ్సైట్లోనూ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలియజేయొచ్చని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు. తెలంగాణలో దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు.

## ఎడిటోరియల్



**మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి.**

ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం

## ఖర్చులు తగ్గింపు... మోడీ నుంచే మొదలవ్వాలి!

తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700-900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుమతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

# వివేకంతో అడుగు వేద్దాం.. ఉద్దేశంతో జీవిద్దాం!

**మానవ జీవితం ఒక అద్భుతమైన, నిగూఢమైన రహస్యాలతో నిండిన ప్రయాణం. ఈ అనంత కాలవాహినిలో ప్రతి మనిషి తన జీవితమనే రంగుల రంగస్థలంపై నిలబడి, ఏదో ఒక సందర్భంలో, తనను తాను నిలదీసే రెండు కీలక ప్రశ్నలు ఉంటాయి. అవే నేను ఎంతవరకు వెళ్ళాలి? అసలు ఇదంతా ఎందుకొరకు? ఈ రెండు చిన్న ప్రశ్నలలోనే మానవ అస్తిత్వపు సమస్త తాత్వికత, సామాజిక బాధ్యత దాగి ఉన్నాయి. ఒకటి మన శక్తి సామర్థ్యాల పరిమితిని గుర్తుచేస్తే, మరొకటి మన ఉనికి వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని వెతుకుతుంది.**



ఈ అంతర్మథనమే మనిషిని జంతువు నుంచి మహనీయుడిగా మారుస్తుంది. మన పూర్వీకుల చరిత్రను ఒక్కసారి తరచి చూస్తే, వారు కేవలం మనుగడ కోసం మాత్రమే పోరాడలేదు. సాహసమే ఊపిరిగా నదులు దాటారు, అభేద్యమైన కొండలు ఎక్కారు, అరణ్యాలు చీల్చుకుంటూ కొత్త బాటలు వేశారు. అయితే, వారు ఎక్కడ ఆగిపోవాలో కూడా తెలుసుకున్నారు. ఆ ఆగిపోవడం అన్నది వారి అసమర్థత కాదు, అది ఒక పరిపూర్ణమైన వివేకం. ఒక అజేయమైన సైనికుడు రణభూమిలో శత్రువుపై ఎంత దూరం దాడి చేయాలో, ఎప్పుడు వెనక్కి తగ్గాలో తెలిసినప్పుడే నిజమైన వీరుడవుతాడు. అలాగే, సంక్లిష్టమైన జీవిత చక్రంలో ఎంతవరకు అన్న ప్రశ్నకు సమాధానం దొరికినవాడే నిజంగా సార్థక జీవి అవుతాడు. నేటి ఆధునిక, వేగవంతమైన సమాజంలో మనం ప్రతి విషయాన్ని మరింత (More) అన్న కోణంలోనే చూస్తున్నాం. మరింత సంపద, మరింత కీర్తి, మరింత అధికారం ఈ అంతులేని పరుగు పందెంలో మనం ఎక్కడి నుండి బయలుదేరాం, ఎక్కడికి చేరుకోవాలి అన్న ప్రాథమిక స్పృహను కోల్పోతున్నాం. ఎంతవరకు అన్న ప్రశ్న మనకు ఒక నిలువుటద్దం లాంటిది. ఆ అద్దంలో చూసుకున్నప్పుడు మాత్రమే మన అసలు ముఖం, మన నిజమైన అవసరాలు కనిపిస్తాయి. అధికం ఎప్పుడూ ప్రమాదమే. అమృతం కూడా అతి అయితే విషమే అవుతుంది కదా! మహాత్మా గాంధీ ఒక అద్భుతమైన మాట చెప్పారు. ఈ భూమి మనందరి అవసరాలను తీర్చగలదు, కానీ ఏ ఒక్కరి దురాశను కాదు. ఈ చిన్న వాక్యంలో జీవిత సత్యమంతా ఇమిడి ఉంది. అవసరం అనేది ఒక స్పష్టమైన హద్దు, కానీ దురాశ అనేది అంతులేని అగాధం. తన హద్దును తాను గుర్తించినవాడు ఈ ప్రపంచంలోనే అత్యంత స్వేచ్ఛాపరుడు. కానీ, ఆ హద్దును విస్మరించినవాడు తన సొంత కోరికలకే బందీ అయి, జీవితాంతం అశాంతితో రగిలిపోతాడు. అదేవిధంగా, మనల్ని లోపలికి నడిపించే మరో ప్రశ్న ఎందుకొరకు?. ఒక విద్యార్థి అహర్నిశలు చదువుతాడు ఎందుకొరకు? అది కేవలం ఒక కాగితం ముక్క లాంటి డిగ్రీ కోసమా, లేక లోక జ్ఞానం కోసమా? ఒక వ్యాపారి కోట్లు గడిస్తాడుఎందుకొరకు? అది తన కుటుంబ విలాసాల కోసమా, లేక సమాజంలో ఒక మార్పు తీసుకురావడానికా? మన ఉద్దేశమే

సంతోషాన్ని ఏమాత్రం పెంచదు సరికదా, ఒత్తిడిని పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అయినా మనం పరుగు ఆపడం లేదు. ఎందుకు? ఎందుకంటే మనం మన ఆత్మతో సంభాషించడం మానేశాం. ఎంతవరకు అన్న ప్రశ్నను మన అంతరాత్మకు వేసుకోవడం విస్మరించాం. పోతన భాగవతంలో ప్రహ్లాదుడు, అంబరీషుడు వంటి భక్తాగ్రేసరులు రాజ్యభోగాలను కాదని, కేవలం భక్తినే ఎందుకు కోరుకున్నారంటే, వారికి తమ జీవిత లక్ష్యం పట్ల స్పష్టత ఉంది. వారు కాలం దాటి చిరంజీవులుగా మిగిలారు. జపనీస్ సంస్కృతిలో ఇకిగై (×ెఱస్త్రుఱ) అనే ఒక అద్భుతమైన భావన ఉంది. దీని అర్థం జీవించడానికి ఒక కారణం. మీరు దేన్ని ప్రేమిస్తారు? మీరు దేనిలో నైపుణ్యం కలిగి ఉన్నారు? ప్రపంచానికి మీ నుండి ఏం కావాలి? మీకు దేని వల్ల ప్రతిఫలం

(×త్వత్‌అశీఅ) మన కర్మను నిర్ణయిస్తుంది. ఆ కర్మలే మన భవిష్యత్తును నిర్మిస్తాయి. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అనే శ్లోకం ఇక్కడ ఎంతో ప్రసక్తమవుతుంది. ఫలితం మీద కాకుండా, చేసే పనిపై చిత్తశుద్ధితో దృష్టి పెట్టడమే ఎందుకొరకు అనే ప్రశ్నకు లభించే మహోన్నతమైన సమాధానం. అది ధర్మం కోసం, సత్యం కోసం, తోటి మానవత్వం కోసం చేసే నిష్కామ కర్మ కావాలి."అతి సర్వత్ర వర్జయేత్" అనేది మన పెద్దలు చెప్పిన ఆణిముత్యం. ఇది కేవలం నీతి బోధ కాదు, ప్రకృతి సహజ సిద్ధమైన సూత్రం. ఒక చెట్టు అతిగా పెరిగి, తన వేర్ల బలాన్ని మించి విస్తరిస్తే, చిన్న తుఫానుకే కుప్పకూలిపోతుంది. నది తన పరివాహక ప్రాంతాన్ని మించి పొంగి ప్రవహిస్తే, అది జనజీవనానికి వినాశనాన్ని తెస్తుంది. అలాగే, మనిషి తన పరిమితులను విస్మరించి ప్రతిదాన్నీ సొంతం చేసుకోవాలని చూస్తే, చివరికి ఆ అతివ్యాప్తే తన పతనానికి దారితీస్తుంది. ఆధునిక మనోవైజ్ఞానికులు దీనినే »Enough Pointµµ లేదా సంతృప్తి స్థాయి అని పిలుస్తారు. ఒక వ్యక్తికి తన ప్రాథమిక అవసరాలు, కనీస సౌకర్యాలు తీరిన తర్వాత లభించే అదనపు సంపద అతని

లభిస్తుంది? ఈ నాలుగు అంశాలూ ఎక్కడైతే కలుస్తాయో, అదే మీ జీవిత పరమార్థం. మన భారతీయ సంస్కృతి దీనిని ఎప్పుడో "ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయచ" అని నిర్వచించింది. అంటే తన ఆత్మ ముక్తి కోసం మరియు ప్రపంచ శ్రేయస్సు కోసం జీవించడం. శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పినట్లు, దీపం తన నూనెను తాను ఖర్చు చేసుకుంటూ చీకటిని పారద్రోలుతుంది. దాని మనుగడ వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం వెలుగునివ్వడమే. మనిషి జీవితం కూడా ఒక ప్రమిద వంటిదే. తన శక్తిని, జ్ఞానాన్ని ఇతరుల మేలు కోసం ఖర్చు చేసినప్పుడే ఆ జీవితం వెలుగులీనుతుంది. ఇతరుల కోసం బతికేవాడు మరణించాక కూడా అనేకమంది హృదయాలలో జీవిస్తాడు. ఒక నది తన రెండు ఒడ్డుల మధ్య ప్రవహిస్తున్నంత కాలమే అది జీవనది. ఆ హద్దులు దాటితే అది ప్రళయం. నేటి పోటీ ప్రపంచంలో మనం అన్నిటా హద్దులు దాటుతున్నాం. పిల్లలు ర్యాంకుల వేటలో, పెద్దలు ప్రమోషన్ల పరుగులో తమ ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను ఫణంగా పెడుతున్నారు. అధిక ఒత్తిడి, నిద్రలేమి, విచ్ఛిన్నమవుతున్న బంధాలు ఇవన్నీ ఎంతవరకు అన్న ప్రశ్నను మనం గాలికి వదిలేసినందుకు ప్రకృతి ఇస్తున్న సంకేతాలు. మన శరీరం, మన మనసు కూడా ఒక పరిమితిని కోరుకుంటున్నాయి. ఆ హద్దును గుర్తించిన రోజే నిజమైన శాంతి లభిస్తుంది.

గురజాడ అప్పారావు గారు అన్నట్లు, దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా ఇందులో ఎందుకొరకు అనే దానికి జవాబు ఉంది. మన ప్రతి అడుగు సమాజంలో మంచిని పెంచేదిగా ఉండాలి. ప్రేమ, కరుణ, త్యాగం అనేవి కేవలం పుస్తకాల్లోని పదాలు కావు, అవి మన ప్రయాణంలో దిక్సూచీలు కావాలి. ఈ క్షణం నుండి మీరు తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ఈ రెండు ప్రశ్నలను నిలబెట్టండి. ఎంతవరకు? ఇది మీకు క్రమశిక్షణను, తృప్తిని, వివేకాన్ని నేర్పుతుంది. ఎందుకొరకు? ఇది మీకు సరైన మార్గాన్ని, గమ్యాన్ని, జీవితానికి ఒక అర్థాన్ని చూపిస్తుంది. మనం ఈ భూమిపైకి ఒక ఉన్నతమైన ఉద్దేశంతో వచ్చాం. ఆ ఉద్దేశాన్ని మర్చిపోయి కేవలం యాంత్రికంగా బతకడం కంటే పెద్ద విషాదం మరొకటి లేదు. ఎంతవరకు అనేది మిమ్మల్ని నిరర్థకమైన పరుగు నుండి కాపాడుతుంది. ఎందుకొరకు అనేది మిమ్మల్ని ఒక మహోన్నత శిఖరం వైపు నడిపిస్తుంది. తత్వవేత్త సుకరాత్ అన్నట్లు, పరీక్షించబడని జీవితం జీవించడానికి యోగ్యమైనది కాదు. మీ ప్రయాణం ఎంత దూరం సాగినా, అది మీకు, మీ కుటుంబానికి మరియు ఈ సమాజానికి మేలు చేసేదిగా ఉండాలని ఆశిద్దాం. పరిమితులు తెలిసి ప్రవర్తించడం వివేకం అయితే, ఉద్దేశం తెలిసి జీవించడం జ్ఞానం. ఈ రెండింటి కలయికే ఒక పరిపూర్ణ మానవుడి లక్షణం. మీ ప్రతి అడుగు ఒక అర్థవంతమైన గమ్యం వైపు సాగాలని, మీ జీవితం పదిమందికి వెలుగునిచ్చే దీపం కావాలని ఆకాంక్షిస్తూ ఈ నూతన ఆలోచనతో మీ ప్రయాణాన్ని సాగించండి!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా ?

మనవిదేశా మారక నిల్వలు పెరగాలంటే ఎగుమతులు పెరగాలి. దిగుమతలు తగ్గాలి. ఈ సూత్రాన్ని పాటించాల్సిన పాలకులు దీనిని పట్టించుకోవడం లేదు. పంటల దిగుబడి పెరుగు తున్నా వాటిని ఆదయ వనరుగా మార్చుకోవడంలో కేంద్రం విఫలం అవుతోంది. విదేశీమారక నిల్వలు తగ్గిపోతుంటే విదేశీ పెట్టుబడిదారులు ఆ దేశంలో తాము పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. సాధారణంగా 7-10 నెలలపాటు ముడిచమురు దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉంటే ఆ దేశ పరపతి బాగున్నట్టుగా అంచనా వేస్తారు. 1991లో మన దేశం వద్ద కేవలం 2 వారాలకు సరిపడా మాత్రమే విదేశీ మారక ద్రవ్య నిల్వలున్నాయి. అందుకే మన బంగారాన్ని లండన్‌కి పంపి తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాటి చంద్రశేఖర్ ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టింది. పివి నరసింహారావు ప్రధాని అయ్యాక ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతో దేశం దారికి వచ్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని వడిపంచుకోగలిగాం. దీంతో మళ్లీ మనదేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందంటే ఆ మహానుభావుడి చొరవే కారణం. ఇప్పుడు మోడీ కూడా అలాంటి చొరవ లేదా సంస్కరణలకు దిగాలి. మూడీస్, ఎస్ అండ్ పి, ఫిచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఫారెక్స్ రిజర్వ్ ఎక్కువగా ఉన్న దేశాలకు మంచి రేటింగ్ ఇస్తాయి. ఆ రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తాయి. ఒక దేశం విదేశాల నుంచి అప్పు తీసుకోవాలనుకుంటే.. ఆయా దేశాలు సదరు దేశం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఎంత ఉన్నాయనే విషయాన్నే చూస్తాయి. ఇప్పుడు మన వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు 9 నుంచి 11 నెలలకు సరిపడా ఉన్నప్పటికీ.. పరిస్థితులు మన చేతుల్లో లేవు. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసేలాగా కనిపించట్లేదు. ముడిచమురు ధరల భారంతోపాటు.. ఎరువుల ధరలు కూడా భారీగా పెరిగిపోయే ప్రమాదం కనపడుతోంది. అంటే వాటి దిగుమతుల కోసం చేయాల్సిన ఖర్చు మరింతగా పెరిగిపోయి డాలర్ల రిజర్వు అనుకున్నదానికంటే వేగంగా కరిగిపోయే ముప్పుంది. దీనికితోడు.. మనకు వచ్చే విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవే. అక్కడున్న భారతీయులు మనదేశంలో ఉన్న తమ కుటుంబసభ్యులకు పంపే డబ్బు కారణంగా విదేశీ మారకం భారీగా పెరిగింది.. యుద్ధం దెబ్బకు అతలాకుతలమైన గల్ఫ్ దేశాల్లో ఉంటున్న మనవాళ్లు పంపే డబ్బు తగ్గిపోతోంది. దీనికితోడు.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన ఎగుమతులకు, తద్వారా మనకు రావాల్సిన డాలర్లకు కూడా ఆటంకం కలుగుతోంది. ఒకవైపు మనకు రావాల్సిన విదేశీ మారక ద్రవ్యంలో కోత పడుతుండగా, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు కరిగిపోతున్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం, దేశ జాతీయ రుణం అక్షరాలా రూ.235.4 లక్షల కోట్లు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పు కేవలం రూ.54.9 లక్షల కోట్లు మాత్రమే. అంటే, కేవలం పదేండ్ల కాలంలో దేశం చేసిన అప్పు 4.3 రెట్లు పెరిగింది. ప్రతి భారతీయుడిపై సగటున రూ.1.66 లక్షల అప్పు ఉన్నది. జీడీపీలో అప్పు నిష్పత్తి 67 శాతం నుంచి 83.9శాతానికి చేరుకున్నది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని పాలకులు గర్వంగా చెప్తుంటారు. 3.73 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో మనం ఆ స్థానంలో ఉన్నమాట నిజమే. కానీ, ఇందులో ఒక పెద్ద మాయ ఉన్నది. ఒక దేశం ఎంత ధనవంతమైనదో చెప్పాల్సింది దాని మొత్తం ఆదాయం కాదు, ఆ దేశ పౌరుడి తలసరి ఆదాయం. దేశ ఆర్థిక శక్తిని తలసరి ఆదాయపరంగా విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. ఆదాయ పంపిణీలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామని, సంపద కేవలం పైస్థాయిలోనే కేంద్రీకృతమై సామాన్యుడి వరకు ఆశించిన స్థాయిలో చేరటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క అమెరికన్ సంపాదన మన దేశంలోని 30 మంది పౌరుల మొత్తం ఆదాయంతో సమానం. జనాభాపరంగా మనం పెద్ద దేశం కాబట్టి జీడీపీ పెద్దదిగా కనిపిస్తుంది. కానీ పౌరుడి జీవన ప్రమాణాల విషయానికి వస్తే ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం మనం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నాం.

# వీఆర్‌ఎస్.. ఉద్యోగుల కోరిక మేరకేనా?

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ ఇటీవల ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్‌ఎస్) కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇది కేవలం వ్యయ నియంత్రణ కోసం చేపట్టిన చర్య అని వస్తున్న విశ్లేషణలను కంపెనీ యాజమాన్యం తోసిపుచ్చింది. ఈ పథకం పూర్తిగా ఉద్యోగ సంఘాల (యూనియన్ల) విజ్ఞప్తి మేరకు, వారి ప్రయోజనాల కోసమే ప్రవేశపెట్టామని కంపెనీ స్పష్టం చేసింది.

**యాజమాన్యం వివరణ**

సాధారణంగా ఏ కంపెనీ అయినా వీఆర్‌ఎస్ ప్రకటిస్తే అది శ్రామిక శక్తిని తగ్గించుకోవడానికో లేదా నష్ట నివారణ కోసమో అని భావిస్తారు. అయితే, టాటా మోటార్స్ దీనిపై భిన్నమైన వాదనను వినిపించింది. 'వివిధ ప్లాంట్ల వద్ద ఉన్న ఉద్యోగులు, యూనియన్ల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు స్పందనగానే ఈ పథకాన్ని రూపొందించాం. ఇది హెడ్ కౌంట్ తగ్గించడానికో లేక ఖర్చులను హేతుబద్ధీకరించడానికో చేపట్టిన పథకం కాదు' అని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. గత నాలుగేళ్లలో టాటా మోటార్స్ చేపట్టిన మూడో వీఆర్‌ఎస్ ఇది. ముఖ్యంగా, అక్టోబర్ 2025 నుంచి ప్యాసింజర్ వెహికల్ (పీవీ), కమర్షియల్ వెహికల్ (సీవీ) విభాగాలుగా కంపెనీ విడిపోతున్న నేపథ్యంలో చేపట్టిన మొదటి ప్రధాన ఉద్యోగ సంస్కరణ కావడం గమనార్హం.




**భవిష్యత్ అవసరాల కోసమేనా?**

కంపెనీ దీన్ని స్వచ్ఛందమైనదిగా పేర్కొంటున్నప్పటికీ పరిశ్రమ విశ్లేషకులు మాత్రం ఆటో రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులతో దీనికి ముడిపెడుతున్నారు. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగం ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ఐసీఈ) నుంచి ఎలక్ట్రిక్ వాహనాలవైపు వేగంగా మారుతోంది. సంప్రదాయ ఇంజిన్ల తయారీతో పోలిస్తే ఈవీల తయారీలో కదిలే భాగాలు తక్కువగా ఉంటాయి. దీనివల్ల అసెంబ్లీ లైన్లలో తక్కువ మంది కార్మికులు సరిపోతారు. దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు, వైద్య ప్రయోజనాల రూపంలో కంపెనీకి అయ్యే వ్యయం ఎక్కువ. వన్-టైమ్ సెటిల్మెంట్ ద్వారా దీర్ఘకాలికంగా బ్యాలెన్స్ షీట్‌ను మెరుగుపరుచుకోవడానికి కంపెనీలు ఇలాంటి పథకాలను ఎంచుకుంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రతిస్పందన**

టాటా మోటార్స్ వద్ద మొత్తం 58,442 మంది ఉద్యోగులు ఉండగా తాజా గణాంకాల ప్రకారం సుమారు 750 మంది ఈ పథకానికి అర్హులుగా తేలారు. అయితే, వారిలో కేవలం 275 నుంచి 300 మంది మాత్రమే వీఆర్‌ఎస్ ఎంచుకున్నట్లు సమాచారం. ఉద్యోగ భద్రతకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ మెజారిటీ కార్మికులు విధుల్లోనే కొనసాగడానికి మొగ్గు చూపడం విశేషం.

# స్థిరమైన ఆదాయానికి.. సరికొత్త ప్లాన్!

అవీవా ఇండియా 'అవీవా సెక్యూర్ నెస్ట్ యాన్యూటీ ప్లాన్'ను ప్రవేశపెట్టింది. సింగిల్ ప్రీమియంతో స్థిరమైన ఆదాయాన్ని పొందే పరిష్కారమే ఈ ప్లాన్ అని సంస్థ ప్రకటించింది. 80 ఏళ్ల వయసు వరకు ఈ ప్లాన్‌లోకి ప్రవేశించొచ్చు. ఈ ప్లాన్ కింద ఒకరికి లేదంటే ఉమ్మడిగా కవరేజీని కూడా పొందొచ్చు. మరణానంతరం నామినీలకు కొనుగోలు ధరను చెల్లించే సదుపాయం కూడా ఉంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) నిబంధనలకు అనుగుణంగా ఈ ప్లాన్ పనిచేస్తుందని అవీవా ఇండియా తెలిపింది. జీవిత కాలం పాటు స్థిరమైన ఆదాయానికి ఈ ప్లాన్ ద్వారా భరోసా ఇస్తున్నట్టు అవీవా ఇండియా ఎండీ, సీఈవో అసిత్ రథ్ తెలిపారు.

**బజాజ్ లైఫ్ 'యంగ్ అచీవర్ ప్లాన్'**

బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ చదువుకునే పిల్లల పేరిట సంపద సృష్టితోపాటు, వారి భవిష్యత్ లక్ష్యాలకు కవరేజీతో కూడిన 'బజాజ్ లైఫ్ యంగ్ అచీవర్ ప్లాన్'ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా పిల్లల కోసం కావాల్సినంత నిధిని (హామీతో కూడిన) సమకూర్చుకోవచ్చు. తల్లి/తండ్రి మరణిస్తే లేదా వైకల్యం పాలు కావడం లేదంటే ఎంపిక చేసిన 25 తీవ్ర అనారోగ్యాల్లో (క్రిటికల్ ఇల్‌నెస్) ఏదేనీ బారిన పడితే, ఆ తర్వాత భవిష్యత్ ప్రీమియంలు చెల్లించక్కర్లేదు. పాలసీ యథావిధిగా కొనసాగుతుంది. ఒకే విడత చెల్లింపులు లేదా పిల్లల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్రమానుగతంగా ఆదాయం అందుకునే ఆప్షన్లలో ఒకదానిని ఎంపిక చేసుకోవచ్చు. 5--12 ఏళ్ల మధ్య ప్రీమియం చెల్లింపుల కాలవ్యవధిని ఎంపిక చేసుకోవచ్చు. ప్రీమియం చెల్లింపులకు, చివర్లో అందుకునే ప్రయోజనాలపై పన్ను ప్రయోజనాలున్నాయి.



# కష్టాల్లో ఉన్నాం.. ఖర్చులొద్దు




**వ్యయ నియంత్రణ దిశగా ఎయిర్ ఇండియా**

**ఇప్పటికైతే తొలగింపుల్లేవ్.. జీతాల పెంపూ లేదు**

**ఉద్యోగులతో యాజమాన్యం**

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన రంగ సంస్థ, టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిర్ ఇండియా.. వ్యయ నియంత్రణ దిశగా అడుగులేస్తున్నది. ఈ క్రమంలోనే 'సంస్థ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అనవసరపు ఖర్చుల జోలికి వెళ్లవద్దు' అని శుక్రవారం ఉద్యోగులకు యాజమాన్యం సూచించింది. అలాగే ఇప్పటికైతే ఉద్యోగాల తొలగింపులేమీ ఉండబోవని భరోసా ఇచ్చిన కంపెనీ.. కనీసం మూడు నెలలపాటైనా వార్షిక వేతనాల పెంపును వాయిదా వేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసినట్టు సమాచారం. ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్, సీఎఫ్‌వో సంజయ్ శర్మ, చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ రవీంద్ర కుమార్ జీపీ.. టౌన్‌హాల్‌లో ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. వీరంతా కూడా ఉద్యోగులకు దుబారాపై దృష్టి పెట్టండని నొక్కిచెప్పినట్టు తెలుస్తున్నది. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో తీవ్ర సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. ఓవైపు మార్కెట్‌లో విజృంభించిన ముడి చమురు ధరలు.. విమానయాన ఇంధనాన్ని 2.5-3 రెట్లు ఖరీదెక్కించాయి. మరోవైపు అమెరికాకు అండగా ఉంటున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో.. యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాల్లో గగనతల ఆంక్షలు వచ్చిపడ్డాయి. ఈ ప్రభావం భారతీయ విమానయాన రంగంపై స్పష్టంగా పడుతున్నది. పెరిగిన నిర్వహణ ఖర్చులు, తగ్గిన ఆదాయం ఎయిర్‌లైన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా తాజా నిర్ణయాలే ఇందుకు నిదర్శనం. నష్టాల నుంచి గట్టెక్కడానికే ఈ వ్యయ నియంత్రణ చర్యలు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా, గురువారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో తాత్కాలిక సెలవులు (ఈ సెలవులకుగాను ఉద్యోగులకు కంపెనీలు జీతాలు చెల్లించవు) సహా, వ్యయ నియంత్రణకున్న అన్ని అవకాశాలపై చర్చ జరిగింది. ఈ క్రమంలోనే ఉద్యోగులతో కంపెనీ ఉన్నతవర్గాలు పైవిధంగా చెప్పుకొచ్చాయి. పొరుగున ఉన్న పాకిస్థాన్‌తో సరిహద్దు గొడవల దృష్ట్యా ఆ దేశ గగనతలాన్ని చాలాకాలం నుంచి వినియోగించలేకపోతున్న భారతీయ విమానయాన సంస్థలకు.. గత 2 నెలలకుపైగా మెజారిటీ గల్ఫ్ దేశాలకూ స్వేచ్ఛగా వెళ్లలేని దుస్థితి తలెత్తింది.

# ఎక్కువ మైలేజ్ కోసం ఒక్క కిట్: రూ.83 వేలతో..

నిస్సాన్ మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (NMIPL) ఆల్ న్యూ నిస్సాన్ గ్రావైట్ కోసం.. ప్రభుత్వ ఆమోదం పొందిన సీఎన్‌జీ రెట్రోఫిట్ కిట్‌ను లాంచ్ చేసింది. దీని ధర రూ. 82,999. ఇది దేశంలోని 16 రాష్ట్రాల్లో అందుబాటులో ఉంటుంది. ఈ సీఎన్‌జీ కిట్‌ను మోటోజెన్ తయారు చేసి.. నాణ్యతను కూడా నిర్ధారించింది. వినియోగదారులు ఈ కిట్‌ను నిస్సాన్ అధికారిక డీలర్ల ద్వారా కొనుగోలు చేయవచ్చు. కంపెనీ ఈ కిట్‌పై 3 సంవత్సరాలు లేదా 1 లక్ష కిలోమీటర్ల వరకు వారంటీ కూడా లభిస్తుంది. సీఎన్‌జీ రెట్రోఫిట్ కిట్‌లో రెండు 25 లీటర్ సిలిండర్లు ఉంటాయి. కాబట్టి దీనిని కారులో ఫిక్స్ చేసినప్పుడు కూడా అదే స్పేస్ ఉంటుంది. మూడో వరుస సీటింగ్‌లో కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. తక్కువ ఖర్చుతో.. కొంత ఎక్కువ మైలేజ్ కావాలనుకునే వారు ఈ కిట్ ఏర్పాటు చేసుకోవచ్చు.

# బంధన్ బ్యాంక్ విస్తరణ


హైదరాబాద్: తెలంగాణలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఒకేసారి మూడు శాఖలను ప్రారంభించింది బంధన్ బ్యాంక్. వీటిలో హైదరాబాద్‌లో రెండు శాఖలను ఆరంభించిన సంస్థ..మరొకటి మిర్యాలగూడలో నెలకొల్పింది. దీంతో తెలంగాణలో శాఖల సంఖ్య 162కి చేరుకున్నాయి. తమిళనాడులో ఐదు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో రెండు చొప్పున ప్రారంభించినట్లు బంధన్ బ్యాంక్ ఎండీ, సీఈవో పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా తెలిపారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో ఈ కొత్త శాఖలను ప్రారంభించినట్టు, తద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి వీలు పడనున్నదన్నారు.




# నెక్సాన్ కొత్త వేరియంట్ లాంచ్

టాటా మోటార్స్.. నెక్సాన్ ప్యూర్ ప్లస్ పీఎస్ వేరియంట్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.9.59 లక్షలు (ఎక్స్ షోరూమ్). కంపెనీ పది లక్షల నెక్సాన్‌ల అమ్మకాలను పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కొత్త వేరియంట్ లాంచ్ చేసింది. టాటా నెక్సాన్ ప్యూర్ ్రూా వేరియంట్.. రోజువారీ వినియోగానికి అనుకూలంగా ఉంటుంది. కంపెనీ అందుబాటు ధరకే ఇందులో అనేక ప్రీమియం ఫీచర్లను అందిస్తుంది. విశాలమైన, ఓపెన్ క్యాబిన్ అనుభూతిని కలిగించే వాయిస్ అసిస్టెడ్ పనోరమిక్ సన్‌రూఫ్, నిరంతరాయ కనెక్టివిటీ కోసం వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లేలకు సపోర్ట్ చేసే 10.25-అంగుళాల హార్మన్ టచ్‌స్క్రీన్ ఉన్నాయి. ఆరు-స్పీకర్ల ఆడియో సెటప్, క్రూజ్ కంట్రోల్, రెయిన్-సెన్సింగ్ వైపర్‌లు కూడా ఈ కొత్త వేరియంట్లో ఉన్నాయి. ఆటో ఎల్‌ఈడీ హెడ్‌లైట్లు, డైనమిక్ గైడ్‌లైన్స్, పార్కింగ్ సెన్సార్‌లతో కూడిన ఎణ రివర్స్ కెమెరా, ఆటో ఫోల్డ్ ఫంక్షనాలిటీతో కూడిన ఎలక్ట్రికల్లీ అడ్జస్టబుల్ ా=ఎవీలు, ఎల్‌ఈడీ టెయిల్ ల్యాంప్‌లు, పుష్-బటన్ స్టార్ట్ వంటివి కూడా ఉన్నాయి.

# మళ్లీ ఎంఎంటీసీ.. రూ.10కే డిజిటల్ గోల్డ్, సిల్వర్!



డిజిటల్ రూపంలో బంగారం, వెండిని నేరుగా కొనుగోలు చేసుకునేందుకు వీలుగా ఎంఎంటీసీ--పీఏఎంపీ ప్లాట్‌ఫామ్ తిరిగి ప్రారంభమైంది. ఎంఎంటీసీపీఏఎంపీ వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్ నుంచి, అలాగే గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే యాప్స్ నుంచి కూడా కొనుగోలు చేసుకోవచ్చని సంస్థ ప్రకటించింది. సంస్థ డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్‌ను మొదటిసారి 2017లో, డిజిటల్ వెండి కొనుగోళ్లకు 2023లో అవకాశం కల్పించింది. మరింత మెరుగైన అనుభవానికి వీలుగా వెబ్‌సైట్‌ను నవీకరించేందుకు 2024 చివర్లో ఈ సేవలను నిలిపివేసింది. ఈ కాలంలో థర్డ్ పార్టీ (ఫోన్‌పే తదితర) యాప్స్ ద్వారా కొనుగోళ్లకు అవకాశం కల్పించింది. నవీకరించిన వెబ్‌సైట్‌ను తాజాగా ప్రారంభించినట్టు సంస్థ ప్రకటించింది. కనీసం రూ.10 నుంచి డిజిటల్ గోల్డ్, సిల్వర్ కొనుగోలు చేసుకోవచ్చని తెలిపింది. ప్రతీ కొనుగోలు విలువకు సరిపడా భౌతిక బంగారం, వెండిని బీమా రక్షణతో కూడిన ఖజానాల్లో ఎంఎంటీసీ--పీఏఎంపీ భద్రపరుస్తుంది. బంగారం, వెండిపై పెట్టుబడులకు ఇటీవలి కాలంలో ఎక్కువ మంది ఇన్వెస్టర్లు మొగ్గు చూపిస్తున్న నేపథ్యంలో ఎంఎంటీసీ తిరిగి ఈ ప్లాట్‌ఫామ్‌ను తీసుకురావడం గమనార్హం.

# హ్యుందాయ్ రూ.7,500 కోట్ల పెట్టుబడులు

ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్ ఇండియా.. దేశీ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో రెండో స్థానాన్ని తిరిగి దక్కించుకోవడంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 7,500 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. 45--50 శాతం భాగాన్ని కొత్త ఉత్పత్తులపై, మిగతా మొత్తాన్ని చెన్నై, పుణెలోని ప్లాంట్ల విస్తరణపై వెచ్చించనుంది. అలాగే రెండు కొత్త ఎస్‌యూవీలను ప్రవేశపెట్టనుంది. వీటిలో ఒక ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కూడా ఉంటుందని కంపెనీ ఎండీ, సీఈవో తరుణ్ గర్గ్ తెలిపారు.

**క్యూ1లో లాభం 22 శాతం డౌన్..**

గత ఆర్థిక సంవత్సరం (2025--26) నాలుగో త్రైమాసికంలో హ్యుందాయ్ లాభం రూ. 1,256 కోట్లుగా (కన్సాలిడేటెడ్‌గా) నమోదైంది. అంతక్రితం క్యూ4లో నమోదైన రూ. 1,614 కోట్లతో పోలిస్తే సుమారు 22 శాతం తగ్గింది. ఆదాయం రూ. 17,940 కోట్ల నుంచి రూ. 18,916 కోట్లకి పెరిగింది. వ్యయాలు రూ. 15,974 కోట్ల నుంచి రూ. 17,572 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో షేరుపై రూ. 21 డివిడెండు ప్రకటించిది. బీఎస్‌ఈలో హ్యుందాయ్ షేరు స్వల్పంగా పెరిగి రూ. 1,852 వద్ద ముగిసింది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.